# కొండపల్లి బొమ్మ

- అద్దేపల్లి జ్యోతి

"ప్రియమైన అక్కకి,

ప్రసాద్ నమస్కరించి వ్రాయునది. నీకో గుడ్‌న్యూస్. అస్తమానం అడిగేదానివి కదా పెళ్లి ఎప్పుడూ? అని. నీ కోరిక తీరబోతోంది. నా పెళ్లి కుదిరింది ఉషారాణితో. అమ్మాయి ఎలా వుంటుంది? కట్నం ఎంత? ఏ వూరు? అనే కదా నీ ప్రశ్నలు. రాస్తున్నాను. నెమ్మదిగా చదువు. పేరు చెప్పేసానుగా. కట్నం మూడు 'ల'కారాలు. ఊరు కొండపల్లి. చదువు డిగ్రీ. అమ్మాయి నాకు బాగా నచ్చింది. అచ్చం కొండపల్లి బొమ్మలా వుంటుంది. నా మనసులో ఎలా వుండాలి అని వూహించుకున్నానో అచ్చం అలాగే ఉంది.

తనకి తండ్రి లేరు. వాళ్ల అమ్మ, అన్నయ్యలే పెళ్లి చేస్తున్నారు. వాళ్ల అన్నయ్యలు ఎలా చెబితే అలా వుంటుందిట. ఈ విషయం నాకు బాగా నచ్చింది. ఈకాలం అమ్మాయిలు ఎవరి మాటా వినడంలేదు. కానీ ఉషారాణి అలా కాదు. అందుకే పల్లెటూరయినా, తండ్రి లేరు అని నాన్న కాదన్నా ఒప్పించి మరీ పెళ్లి చేసుకుంటున్నాను. తను డిగ్రీ ప్రైవేట్‌గా చదివిందిట. ఈ కాలేజీ పిల్లల స్టైల్స్ తనలోలేవు.

పెళ్లికి మీరంతా వారం ముందు రావాలి. ఉషారాణి అడ్రస్ రాస్తున్నాను. సరదాగా లెటర్ వ్రాయి. ఫోటో పంపడంలేదు. పెళ్లిలో చూద్దువుగానీ. అంతవరకూ సస్పెన్స్ తప్పదు. చూసాక నువ్వే చెప్తావ్ 'ఒరే ప్రసాద్ నీ సెలక్షన్ సూపర్ అని'. పెద్దమ్మ వాళ్లకి నాన్న లెటర్ రాసారు పెళ్లి కుదిరిందని. బావగార్ని అడిగానని చెప్పు. పెళ్లికి నువ్వూ, బావగారూ హెల్ప్ చేయాలి. భయపడకు. బరువు పనులు కాదు. చీరలు ఎన్ని కొనాలి, వచ్చినావాళ్లకి ఎంతలో బట్టలు పెట్టాలి అలాంటివేలే"

"ఎక్కడినుంచోయ్ లెటర్? అంత ఆనందంగా చదివేసుకుంటున్నావు" అంటూ వచ్చారు శ్రీవారు.

"ఆ... మా పిన్ని కొడుకు ప్రసాద్ రాసాడండీ. వాడికి పెళ్లి కుదిరిందిట. మనల్ని వారంరోజులు ముందు వచ్చి సహాయం చేయమని రాసాడు. ఇదిగో చదవండి" అని లెటర్ ఆయన చేతిలో పెట్టి వంటింట్లోకి నడిచాను.

ఏదో పని చేస్తున్నాను కానీ మనసంతా ప్రసాద్ రాసిన విషయం మీదే ఉంది.

మగవాళ్లు చాలామంది ఇంతే. వాళ్ల మాటే వినాలి. భార్య అంటే ఒక రిమోట్‌తో నడిచే బొమ్మలా ఉండాలి.

దేనికీ ఎదురు చెప్పకూడదు. స్వంత అభిప్రాయాలు ఉండకూడదు. షోకేస్‌లో బొమ్మలా ఉండాలే తప్ప ఆమెకీ మనసుంటుందని సాటి మనిషిలా గౌరవించరు.

"ఏంటోయ్! మీ తమ్ముడి పెళ్లికి ఆడబడుచు కట్నం ఎంత అడగాలి అని ఆలోచిస్తున్నావా?" అన్నారు శ్రీవారు నవ్వుతూ.

"ఛ...అదేంకాదు. అయినా నా గురించి మీకు తెలియదా?" అన్నాను చిరుకోపంగా.

"అబ్బా సరదాగా అన్నానోయ్, టేకిట్ ఈజీ! ఇంతకీ ఈ తమ్ముడి పెళ్లి సంగతేనా? నన్ను ఏవన్నా పట్టించుకునేదేమన్నా ఉందా?" అన్నారు.

"మీ వేళాకోళానికేంగానీ వాడి ఉత్తరం చదివారుకదా. మీకేం అన్పించలేదా?" అన్నాను.

"అందరికీ నాలా మంచివాళ్లు దొరుకుతారా? ఎక్కడో నీలాంటి అదృష్టవంతులకి తప్ప" అన్నారు మీసాలు మెలివేస్తూ.

"సందు దొరకడం పాపం... గొప్పలు చెప్పేసుకుంటారు" అన్నాను నవ్వుతూ.

"ఇంతకీ మీ తమ్ముడికి బాగా బాగా నచ్చిన విషయం నీకు నచ్చలేదు అని నాకు అర్థమైంది. అందుకేగా ఈ అభ్యుదయ రచయిత్రిగారి మనసు బాధపడుతోంది" అన్నారు నా మనసు ఎప్పటిలా చదివేసిన శ్రీవారు.

నాకు ఆయనలో నచ్చే విషయం అదే. నేను నోరు విప్పి చెప్పకుండానే నా మనసులోని విషయం చెప్పేస్తారు.

దానికి మా లవ్ మ్యారేజీ కూడా ఒక కారణం అనుకుంటూ.

ఉషారాణికి లెటర్ రాసాను.

★★★

పెళ్లి దగ్గర పడింది.

రేపు పెళ్లి అనగా కుటుంబ సమేతంగా విజయవాడ వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకుని కొండపల్లి బస్సు ఎక్కాం.

కొండపల్లి పేరుకు తగ్గట్టుగా ఒకవైపు కొండలున్నాయి.

వాటిని తాకుతూ మేఘాలు కొడైకెనాల్‌ను గుర్తుకు తెచ్చింది.

"అందమైన ప్రకృతిని కంటి కెమెరాలతో ఫోటోలు తీసి హృదయం లాబ్‌లో డెవలప్ చేసి జ్ఞాపకాల ఆల్బమ్‌లో అనుభవాల పేజీలో భద్రంగా దాచా" అన్నారు ఎప్పుడో నేను రాసిన కవితని గుర్తు చేసుకుంటూ శ్రీవారు.

కళ్యాణ మండపానికి వెళ్లాం. మావాళ్లు ఇంకా ఎవరూరాలేదు.

నాకు కొండపల్లి అనగానే గుర్తుకువచ్చిన కొండపల్లి బొమ్మ తల, బుట్టలాంటి గౌనుతో వూగుతూ బాలచందర్ సీరియల్‌లో అస్తమానం చూపించేవాడు. అది కొనుక్కోవాలని ఆశ.

ఎంక్వయిరీ చేస్తే పక్క సందులోనే ఆ షాపులున్నాయని అన్నారు.

వానాకాలంవల్ల మూడురోజులనుంచీ కురుస్తున్న వర్షం కారణంగా రోడ్లు అన్నీ బురదగా ఉన్నాయి.

"మమ్మీ! చూసావా రోడ్లు. నాకు అందుకే పల్లెటూళ్లంటే ఇష్టం ఉండదు" అని గారాలు పోయింది నా కూతురు.

"వానాకాలంలో ఏ రోడ్డు అయినా ఇంతే.

మొన్నామధ్య ఢిల్లీలో భారీ వర్షాలు వచ్చినప్పుడు రోడ్లు ఎలా మునిగిపోయాయో టీవీలో చూపించారు చూడలేదా?" అన్నారు శ్రీవారు.

అన్నిరకాల అందమైన బొమ్మల్ని చూడగానే చాలా ఆనందంగా అన్పించింది.

నాకిష్టమైన బొమ్మ రారమ్మని తల వూపుతూ పిల్చినట్లు అన్పించింది. మధ్యలో బొమ్మ తీసుకున్నాను.

మిగిలిన బొమ్మలు తమ నేస్తం వెళ్లిపోతున్నట్లు ఫీలయి ఆ మూడు బొమ్మలు కూడా తీసుకున్నాను.

మా అమ్మాయి పల్లకీ సెట్, బేండ్‌మేళం సెట్, ఏనుగు అంబారీ సెట్ సెలెక్ట్ చేసింది. సైన్యం సెట్ తయారు చేస్తున్నాడు.

అంతా చేతి పనే. చేతి వేలు సైజులో బొమ్మలు చేసి ఉంచి తరువాత వాటికి కలర్స్ వేసి సెట్ చేస్తారుట.

ప్రసాద్ వాళ్లు రావడానికి ఇంకో రెండు గంటలు పడుతుందని నా చిన్ననాటి స్నేహితురాల్ని చూడడానికి వెళ్లాం.

పట్టాభిరామయ్యగారు ఇల్లు అనగానే వెంటనే చూపించారు.

"చూసావా! పల్లెటూరిలో ఎవరి ఇల్లు అయినా ఈజీగా తెల్సుకోవచ్చు అడ్రస్ లేకపోయినా. అదే మన వూరిలో అయితే ప్రక్క ఇంట్లో ఎవరుంటారో కూడా తెలీదు" అన్నాను అమ్మాయితో.

కామేశ్వరి నన్ను చూడగానే గుర్తు పట్టలేకపోయింది. పద్దెనిమిది సంవత్సరాల తరువాత కలుసుకోవడం కదా.

ముందు మాటలే రాలేదు ఒకన్నొకరు చూసుకోవడం తప్ప. తరువాత గంటదాకా తెగ కబుర్లు చెప్పేసుకున్నాం.

"అమ్మా! ఇక వెళదామా?" అంది నా కూతురు.

మర్నాడు పెళ్లికి రమ్మని పిలిచి వదలలేక వచ్చాను.

పెళ్లి బాగా జరిగింది. కొత్త జంటని మా ఇంటికి ఒకసారి రమ్మని చెప్పి వచ్చేసాం.

★★★

రెండునెలలు గడిచాయి.

హైదరాబాద్‌లో ఏదో పనుందని ఆయన వెళుతూ "మీ ప్రసాద్ కొత్త కాపురం ఎలా వుందో చూద్దువుగానీ రా" అంటే నేనూ వెళ్లాను.

ప్రసాద్ స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకున్నాడు.

"ఏరా కొత్త పెళ్లికొడుకూ! అలా డల్‌గా ఉన్నావేం?" అన్నాను.


"అక్కా! బాగానే వచ్చావు. లేకపోతే నేనే నిన్ను రమ్మని పిలుద్దామనుకుంటున్నాను" అన్నాడు.

"ఏంట్రా మేటర్?" అన్నాను కారణం నేను ఊహించినా సరే.

"సాయంత్రం డాబామీద చెప్తాను" అన్నాడు మమ్మల్ని ఇంట్లో తను ఆఫీసుకు వెళ్లిపోతూ.

ఉషా, నేనూ అన్నీ మాట్లాడుకుని నవ్వుకున్నాం.

సాయంత్రం ప్రసాద్ త్వరగా వచ్చేసాడు.



వస్తూనే నన్ను పైకి లాక్కుపోయాడు.

ఉష ఏదో పనిలో వుంది. ఆయన బైటికి వెళ్లారు.

"అక్కా! నా సమస్యని నువ్వే తీర్చాలి. దేవుడు పంపినట్లు సరిగ్గా వచ్చావు'' అన్నాడు.

"ఏంట్రా నీ సమస్య? ఏంటో చెప్పకుండా నువ్వే తీర్చాలి అంటావేంటి?'' అన్నాను అమాయకంగా.

"సమస్య అంటే ఏమో నేను చెప్పలేనుగానీ నాకీ లైఫ్ నచ్చలేదు. బోర్ కొడుతోంది. తనలో ఏ స్పందనా లేదు. ఏది తెస్తే అదే చేస్తుంది. అది తేలేదే అని గానీ, ఫలానా తెండి అనిగానీ ఏమీ అడగదు. నేను ఏ చీర కట్టుకోమంటే అదే కట్టుకుంటుంది. నేను ఏ సినిమా అంటే అదే వూ అంటుంది'' అన్నాడు బాధగా నిట్టూర్చి.

"ఓస్ ఇది సమస్య ఏంటిరా? అయినా నువ్వు కోరుకున్నదీ, నీకు ఆ అమ్మాయిలో బాగా బాగా నచ్చిన విషయం అదేకదా'' అన్నాను ఓరగంట ప్రసాద్‌నే గమనిస్తూ.

"నాకు నచ్చడం ఏమిటి?'' అన్నాడు అమాయకంగా.

"మరి నువ్వేగా లెటర్ రాసావు నాకు. ఉషకి వాళ్ల అన్నయ్యలు ఎంత చెప్తే అంత అట, నాకు ఆ విషయం బాగా నచ్చింది అన్నావుకదా. మరి అలాగే నడుచుకుంటోంది. మరి బాధ ఎందుకు? ఆనందించక'' అన్నాను కోపంగా ప్రసాద్ వంక చూస్తూ.

"అక్కా! ఏదో నా మాట వినాలి అనుకున్నాను కానీ మరీ ఇలా అనుకోలేదు. అలా ఉండడం నన్ను ఇంత బాధిస్తుందని అనుకోలేదు. ప్లీజ్ అక్కా దీనికి ఏదో ఉపాయం నువ్వే చెప్పు రచయిత్రివి కదా ప్లీజ్'' అన్నాడు.

వాడి మొహం చూస్తే జాలేసింది. కొత్త పెళ్లికొడుక్కి ఉండాల్సిన వుషారు లేదు.

"సరేలే... నేను ఉషకి చెప్తానుగానీ మీ మగాళ్లకి ఇదేం బుద్ధిరా? భార్యను సాటి మనిషిలా కాకుండా మరబొమ్మలా ఉండాలి అనుకుంటారు. భార్య అంటే జీవిత సహచరి, జీవితాంతం నీకు చేదోడువాదోడుగా వుంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నీ వంశాన్ని వృద్ధి చేసే భార్యని భార్యగా చూడడం నేర్చుకోండి. అంతేగానీ కట్టుబానిసలా చూస్తే జీవితంలో ఆనందాన్ని పొందలేవు. భార్య మనసు తెలుసుకుని ఆమెని బాధ పెట్టకుండా చూసుకుంటే ఆమె అందించే ప్రేమని నిర్వచించడానికి భాష చాలదు. భార్య చెప్పకుండా ఆమె మనసులోని భావం ఎలా తెలుసుకోవాలో మీ బావగారి దగ్గర ట్రైనింగ్ తీసుకో'' అన్నాను.

ఇంతలో ఉష టిఫిన్స్ తీసుకుని పైకి వచ్చింది.

"ఉషా కంగ్రాట్స్'' అన్నాను ఆమె చేయి నొక్కుతూ.

"అదేంటి నాకు చెప్పలేదేం? ఇంతకీ ఎన్నో నెల?'' అన్నాడు అయోమయంగా చూస్తూ.

"ఆగరా...ఆగు. అంత కంగారు పడిపోకు. నేను కంగ్రాట్స్ చెప్తున్నది నువ్వు అనుకునేదికాదు. ఉష నేను చెప్పినట్లు చేసి నీలో మార్పు వచ్చేలా చేసింది కదా. అందుకు కంగ్రాట్స్ చెప్తున్నాను'' అన్నాను.

"ఆ...'' అని నోరు తెరిచాడు ఏమీ అర్థంకాక.


"ఇంకో విషయం అయితే మీ ఆయన జుట్టు పీక్కునేలా ఉన్నాడు. చెప్పేస్తున్నాను ఉషా...నీకు పెళ్లి కుదిరిందని, ఆ అమ్మాయి కొండపల్లి బొమ్మలా వుంటుందని, అన్నీ వాళ్ల అన్నయ్యలు చెప్పినట్లు వింటుందని రాసావుకదా. నీ అభిప్రాయం తప్పు అని నీకు చెప్పాననుకో. నీకు అర్థంకాదు. అందుకే నీకు అర్థమయ్యేలా ప్రాక్టికల్‌గా అలా బొమ్మలా అన్నిటికీ తలూపుతూ ఉంటే లైఫ్ ఎంత బోర్‌గా ఉంటుందో నువ్వే తెల్సుకుంటావని ఉషతో చెప్పి అలా బొమ్మలా ఉండమని, అలా నటించమని చెప్పాను. తను నేను చెప్పినట్లు తూచా తప్పకుండా నటించి నీలో మార్పును తీసుకువచ్చింది. ఇంతకీ ఇప్పుడైనా మీ ఆవిడని భార్యలా ఉండాలి అంటావా? లేక కొండపల్లి బొమ్మలా ఉండమంటావా? చెప్పు... నీ ఇష్టం'' అన్నాను నవ్వుతూ.

"అమ్మో...క్షమించు తల్లీ... ఏదో బుద్ధి తక్కువై నా మాట వినాలి అన్నందుకుగాను ఇంత శిక్ష వేస్తావా? మా ఆవిడని అలా బొమ్మలా నటించమని చెప్తావా? అమ్మో... రైటర్స్‌తో చాలా జాగ్రత్తగా ఉండాలి అని తెలియజేసావ్. ఇక నుంచి మా ఆవిడని మామూలుగా ఉండమని చెప్పు అక్కా'' అన్నాడు దణ్ణం పెడుతూ.

"నన్ను కాదు క్షమించమనడం మీ ఆవిడ్ని... నువ్వేం బాధపడకురా. ఈరోజు మీ అసలైన ఫస్ట్‌నైట్‌కి అన్నీ నేను అరేంజ్ చేసి నీకు నామీద వచ్చిన కోపాన్ని తగ్గిస్తాను. సరేనా'' అన్నాను నవ్వుతూ.

వాళ్ల రూమ్‌ని పూలతో అలంకరించి వస్తుంటే షోకేస్‌లో వున్న కొండపల్లి బొమ్మ అందంగా తల వూపుతోంది నవ్వుతూ.

★



## త్రిపాత్రాభినయం

'విక్రమార్కుడు'గా అందరి మన్ననలు పొందిన 'ఇడియట్' రవితేజ ఇప్పుడు తండ్రి, ఇద్దరు కొడుకులుగా ఓ చిత్రంలో త్రిపాత్రాభినయం చేస్తూ జనాన్ని అలరించేందుకు సిద్ధమవుతున్నాడు. ఓ తమిళచిత్రం ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈచిత్రంలో రవితేజ త్రిపాత్రాభినయం చేస్తూ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుడుతున్నాడు. ఇంతకుముందు పౌరాణిక చిత్రాల్లో ఇలాంటి బహుముఖ పాత్రలు ఎక్కువగా కన్పించేవి. ఇప్పుడు మళ్లీ ఆ సంప్రదాయానికి స్వాగతం చెబుతున్నట్టు కన్పిస్తోంది.

